
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 77 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 09, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## యూ ట్యూబర్‌పై కేసు..కెటిఆర్ ఆగ్రహం



హైదరాబాద్,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): యూ ట్యూబర్, జర్నలిస్టు గౌతమ్ గౌడ్ కేసు నమోదు చేయడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఓ రైతు ఆవేదనను గౌడ్ యూట్యూబ్‌లో పెట్టారని, అంతమాత్రానికే కేసు పెడతారా అని, ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు ఈ వీడియోలో తప్పేముంది..? జర్నలిస్టు గౌతమ్ గౌడ్‌పై కేసు ఎందుకు నమోదు చేశారు..? అని తెలంగాణ డీజీపీని కేటీఆర్ ప్రశ్నించారు. నేను కూడా ముషంపల్లిలో రైతు మల్లయ్యను కలిశాను. అతనితో మాట్లాడాను. మరి నాపై కేసు పెడుతారా..? అని డీజీపీని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలోని ముషంపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు.. కాంగ్రెస్ పార్టీని అనవసరంగా గెలిపించామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో సాగునీరు వచ్చింది. 24 గంటల నాణ్యమైన కరెంట్ అందింది. ఏడాదికి రెండుసార్లు మిగతా.. 2లో

# హరియాణాలో హ్యాట్రిక్ విజయం..

జమ్ముకశ్మీర్‌లో గణనీయంగా సీట్లు


- ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి మూడోసారి విజయం
- హరియాణాలో 90 సీట్లకుగాను 48 స్థానాల్లో బీజేపీ గెలుపు
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్.. ఖాతా తెరవని ఆప్
- లెక్కింపులో తొలుత కాంగ్రెస్ జోరు.. తర్వాత పుంజుకున్న బీజేపీ
- కాంగ్రెస్ భస్మాసుర హస్తం.. కుమ్ములాటలతో గెలుపు దూరం
- హస్తంవైపు జాట్లు.. దాంతో బీజేపీవైపునకు జాటేతర వర్గాలు!



న్యూఢిల్లీ, అక్టోబరు 8(నమస్తే ఉదయం): హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది! ప్రీ పోల్, పోస్ట్ పోల్, ఎగ్జిట్ పోల్ అంచనాల్ని తలకిందులు చేస్తూ.. రాజకీయ నిపుణుల విశ్లేషణలను అబద్ధం చేస్తూ.. ముచ్చటగా మూడోసారి విజయం సాధించింది! మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత కొంతసేపటి వరకూ కాంగ్రెస్ జోరు కనిపించినా.. బీజేపీ క్రమంగా పుంజుకుని రేసులో ముందుకు దూసుకుపోయింది.

మొత్తం 90 సీట్లకుగాను.. 48 స్థానాల్లో విజయఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి ఎగ్జిట్ పోల్స్ దాకా.. ప్రతి దశలోనూ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేవలం 37 సీట్లకు పరిమితమై మరోసారి ఓటమి చేదును చవిచూసింది. ఐఎన్ఎల్‌డీ రెండు సీట్లతో సరిపెట్టుకోగా.. కాంగ్రెసతో పొత్తు కుదరక సొంతంగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ డకౌట్ అయిపోయింది! ఇక.. గత ఎన్నికల్లో 10 సీట్లు సాధించి కింగ్ మేకర్ పాత్ర పోషించిన జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఈసారి ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది! సాక్షాత్తూ ఆ పార్టీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా దారుణాతిదారుణంగా ఓడిపోయారు. ఇక.. ఈ ఎన్నికల్లో పోటీ చేసి అందరి దృష్టినీ ఆకర్షించిన వినేశ్ ఫొగట్, సావిత్రి జిందాల్ గెలుపొందడం విశేషం.

కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వినేశ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల తేడాతో గెలిచారు. భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళ అయిన సావిత్రి జిందాల్.. హిసార్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇంత సంతోషంలోనూ బీజేపీకి అసంతృప్తి కలిగించే విషయం.. ఆ పార్టీకి చెందిన 8 మంది మంత్రులు, స్పీకర్ ఓడిపోవడం.అటు హరియాణా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, ఐఎన్ఎల్‌డీ చీఫ్ అభయ్ సింగ్ చౌతాలా కూడా ఓడిపోవడం గమనార్హం. కాగా.. 1966లో ఏర్పాటైన హరియాణాలో ఒక పార్టీ వరుసగా మూడోసారి గెలవడం ఇదే!



"ఈరోజు (మంగళవారం) శరన్నవరాత్రుల్లో ఆరో రోజు. చేతిలో కమలం పట్టుకుని, సింహవాహనాన్ని అధిరోహించిన కాత్యాయనీ మాతను ఆరాధించే రోజు. ఆ తల్లి మనందరినీ ఆశీర్వదించింది. ఈ పవిత్ర సమయంలో.. హరియాణాలో వరుసగా మూడోసారి కమలం వికసించింది. భగవద్గీత పుట్టిన గడ్డపై సత్యం, అభివృద్ధి గెలిచాయి. అబద్ధాల మూటపై అభివృద్ధి హామీ విజయం సాధించింది. "

\- ప్రధాని మోదీ

### కాంగ్రెస్ స్వయంకృతం

హరియాణాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా ఏర్పడిన వ్యతిరేకత, జాట్ సామాజికవర్గంలో ప్రభుత్వంపై నెలకొన్న ఆగ్రహం, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టిన క్రీడాకారుల్లో కొందరు రాజకీయ ఆరంగేట్రం చేసి కాంగ్రెస్ పక్షాన నిలబడడం, రైతు ఆందోళనలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం, అగ్నివీర్ పథకంపై అసంతృప్తి వంటి అనేక పరిణామాల నేపథ్యంలో.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే.. ప్రభుత్వ వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో వర్గపోరు వారి గెలుపు అవకాశాలకు దూరం చేసింది.

జాట్ వర్గం నేత భూపిందర్ సింగ్ హుడాకు దళిత వర్గం నేత కుమారి సెల్జాకు మధ్య విబేధాలు ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం హుడాకు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో రాష్ట్రంలోని మొత్తం 90 స్థానాల్లో 70 సీట్లు తన వర్గంవారికే ఇచ్చుకున్నారని.. ఇది కుమారి సెల్జాకే కాక, జాట్ వర్గానికే చెందిన రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు సైతం మింగుడుపడలేదని చెబుతున్నారు. దీంతో, ఎవరికి వారు రెబల్ అభ్యర్థులను నిలబెట్టడంతో పార్టీకి నష్టం వాటిల్లింది. బీజేపీని కూడా రెబెల్ మిగతా.. 2లో



## ఈ ఫలితాలు బిజెపికి ప్రత్యేకం

- హర్యానా ప్రజలు, కార్యకర్తల కృషి అమోఘం
- కాశ్మీర్ ప్రజలకు కూడా కృతజ్ఞతలు
- కాంగ్రెస్ రాజకీయాలపై మోడీ ఘాటు విమర్శలు

న్యూఢిల్లీ,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ కి స్పష్టమైన మెజారిటీ ఇచ్చినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఆ రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని మరోసారి భరోసా ఇచ్చారు. మంగళవారం వెలువడిన హర్యానా ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 48 సీట్లు కైవసం చేసుకుని మెజారిటీకి అవసరమైన 46 సీట్లను సునాయాసంగా దాటింది. దీంతో పార్టీ మిగతా.. 2లో

## త్వరలో విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీ

- యధావిధిగా ప్రమోషన్లు కల్పిస్తున్నాం
- లైన్‌మెన్లు సరిగా పనిచేసి మన్నన పొందాలి
- విద్యుత్ సమస్యలు, ఫిర్యాదుల కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్
- ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటి సింఎం భట్టి సమీక్ష



ఖమ్మం,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): విద్యుత్ శాఖ నుంచి త్వరలో భారీ నోటిఫికేషన్ రాబోతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆయన ఖమ్మం కలెక్టరేట్‌లో విద్యుత్ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేస్తామని ప్రకటించారు. మిగతా.. 2లో



## హర్యానా హ్యాట్రిక్ విజయంలో సిఎం సైనీ కీలకం

- క్షేత్రస్థాయిలో చకచకా నిర్ణయాలతో ప్రజల్లో విశ్వాసం

న్యూఢిల్లీ,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): హరియాణాలో భాజపా ఓటమి ఖాయమని కొన్ని నెలలుగా సర్వేలు ఘోషించాయి. దీనికి తగ్గట్లే ఆ పార్టీ కూడా అత్మరక్షణలో పడింది. అయితే ఫలితాలు మాత్రం బిజెపిని హ్యాట్రిక్ విజయంతో ఆదరించాయి. బిజెపి చేసిన క్షేత్రస్థాయి పనులతో పరిస్థితి మారింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా కేంద్రం నుంచి రప్పించి నాయబ్ సింగ్ సైనీకి పగ్గాలప్పగించింది. ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా ఆయన్ను డమ్మీ సీఎం అని హేళన చేశారు. కానీ, సీఎం మార్పిడి వ్యూహం భాజపాకు బాగా పనికి వచ్చింది. కేవలం 200 రోజుల్లోనే పార్టీని ఓటమి కోరల నుంచి చారిత్రక విజయం దిశగా నాయబ్ నడిపించారు. తాజాగా మరోసారి రాష్ట్రంలో ప్రభుత్వ పగ్గాలు ఆయనకే అప్పగించే అవకాశాలున్నాయి. తొమ్మిదిన్నరేళ్లలో మనోహర్ లాల్ ఖట్టర్ పాలనపై ప్రజలు గుర్రుగా ఉన్నారన్న విషయాన్ని భాజపా అగ్రనాయకత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందే గమనించింది. దీంతో కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న నాయబ్ సింగ్ సైనీని రాష్ట్రానికి రప్పించి మార్చి 2024లో సీఎం బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో సైనీ మాజీ సీఎం ఖట్టర్‌తో సత్సంబంధాలను నెరపడం ఆయనకు కలిసొచ్చింది. అభ్యర్థుల ఎంపికలో కూడా ఖట్టర్ మాటకు విలువనిచ్చారనే పేరుంది. 2014లో10, 2015లో6 ర్యాలీల్లో భాజపా తరఫున ప్రధాని మోదీ హరియాణాలో ప్రచారం చేశారు. కానీ, ఈ సారి కేవలం ఆయన నాలుగు ర్యాలీలకే పరిమితం అయ్యారు. సైనీనే ప్రచార బాధ్యతలు చూసుకొన్నారు. వాస్తవానికి వ్యతిరేక ఫలితాలు వచ్చినా ఆ బాధ్యత స్వీకరించడానికి సిద్ధపడే ప్రజల్లోకి వెళుతున్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన మిగతా.. 2లో






## సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ వేడుకలలో సి.ఎస్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్ ఉద్యోగస్తులతో కలసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను సచివాలయ ప్రాంగణంలో నిర్వహించడం పట్ల సి.ఎస్ ఆనందం వ్యక్తపరిచారు. మిగతా.. 2లో

## 10న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ


- భారీగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
- ఫైర్ వర్క్స్, లేజర్‌షోలతో ఆకట్టుకునేలా ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై దాదాపు పదివేల మంది మహిళలతో ఈనెల 10 వతేదీన సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలియచేశారు. 10వ తేదీన నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై నేడు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్. మిగతా.. 2లో

## రోడ్డు భద్రతపై యునిసెఫ్ సహకారం

- సారథి ఈ వాహన పోర్టల్‌లో చేరుతున్నాం
- స్క్రాప్ పాలసీ అధ్యయనంతో ఇక్కడా అమలు
- ప్రమాదాల నివారణకు కఠినంగా ట్రాఫిక్ రూల్స్
- రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): రవాణా శాఖలో రెండు మూడు సంస్కరణలు తీసుకువస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మోటారు వాహన చట్టంలో భాగంగా దేశంలో 28 రాష్ట్రాలు ఇప్పటికే సారథి వాహన్ పోర్టల్ అమలు చేస్తున్నాయన్నారు. ఇంటర్ స్టేట్ రిలేషన్స్‌కు ఇబ్బంది వస్తుండడంతో క్షేత్ర స్థాయిలో ఆర్టీవో డీటీవోలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ కూడా సారథి ఈ వాహన పోర్టల్‌లో చేరుతున్నట్లు చెప్పారు. జీవో 28 ద్వారా ఇది అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో, దేశంలో వాహనాలకు సంబంధించి 15 సంవత్సరాలు మనం వాడే వాహనాలు , 8 సంవత్సరాలు ప్రైవేట్ వాహనాలు స్క్రాపింగ్ పాలసీ తీసుకురావడం జరిగిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న మిగతా.. 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో వివక్ష

- ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలకు అన్యాయం
- జీతాలు ఇవ్వలేక యాజమాన్యాలు ఆందోళన
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్,అక్టోబర్ 8(నమస్తే ఉదయం): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, సుమారు 13 లక్షల మంది విద్యార్థుల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం అగమ్యగోచరంగా మార్చింది అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల జరుగుతున్న ఇబ్బందులను హరీశ్‌రావుకు తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజేస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం మూలంగా.. టీసీ, ఇతర సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. దీని వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనివల్ల విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. మిగతా.. 2లో

# హర్యానా హ్యాట్రిక్ విజయంలో సిఎం సైనీ కీలకం

**(మొదటి పేజీ తరువాయి)**
ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. 'గెలిస్తే ఆ ఘనత పార్టీ.. ఓడితే ఆ బాధ్యత నాది' అని తేల్చిచెప్పారు. సైనీ సీఎం అయ్యే నాటికి రాష్ట్రంలో భాజపా తీవ్రమైన రైతు వ్యతిరేకతను మూటకట్టుకొనివుంది. ముఖ్యంగా 2020-2021 రైతు దీక్షలతో ప్రభుత్వం ఇరుకున పడింది. కేంద్రంలో మోదీ సర్కార్,

రాష్ట్రంలో ఖట్టర్ సర్కారు ఇబ్బంది పడ్డాయి. దీనికి తోడు అగ్నివీర్ పథకం రావడంతో పార్టీ పరిస్థితి మరింత దారుణంగా మారింది. 11వ ముఖ్యమంత్రిగా సైనీ బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండున్నర నెలలకే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే పరిస్థితి ఉంది. మొత్తంగా చూస్తే 210 రోజుల పదవీకాలం మిగిలి ఉంది. ఫలితంగా సైనీ వేగంగా మంత్రి వర్గ సమావేశాలు నిర్వహించి ప్రజాకర్షక పథకాలను ప్రకటించారు. చాలా ఉద్యోగాలకు ముందు నోటిఫికేషన్లు జారీ చేశారు. గ్రామ పంచాయతీల వ్యయాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.21 లక్షలకు పెంచారు. దీంతో క్షేత్ర స్థాయిలో మరిన్ని అభివృద్ధి పనులకు వీలు కలిగింది. విద్యుత్తు వినియోగ దారులపై భారంగా ఉన్న కనీస ఛార్జీలను రద్దు చేశారు. కేవలం వినియోగించిన కరెంటుకు మాత్రమే బిల్లులు చెల్లించేలా మార్పులు చేశారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ యోజన అనుబంధంగా రాష్ట్రంలో ఓ పథకాన్ని సైనీ సర్కారు ప్రారంభించింది.

దీని కింద పేద కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లను పంపిణీ చేయాలని సంకల్పించారు. అగ్నివీర్ పథకంపై అసంతృప్తిని చల్లార్చేందుకు సైని సర్కారు వేగంగా చర్యలు చేపట్టింది. అగ్నివీర్ పాలసీ-2024ను తీసుకొచ్చింది. సైన్యంలో సేవలు పూర్తైన వారికి దీని కింద ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ చర్యలు ఆకట్టుకొన్నాయి. నాయబ్ సింగ్ సైనీ 1970 జనవరి 25న మిజాపూర్ మజ్రా గ్రామంలో జన్మించారు. ఆయన ఒక్కో మెట్టూ ఎక్కుతూ పార్టీలో ముఖ్యమంత్రి పీఠానికి చేరువయ్యారు. 1996లో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా జీవితాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత ముజఫర్‌పుర్‌లోని బీఆర్ అంబేద్కర్ బిహార్ విశ్వవిద్యాలయం నుంచి బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఆర్ఎస్ఎస్‌తో సైనీకి బలమైన అనుబంధం ఉంది. ఆయన మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసిన తర్వాత రాజకీయ జీవితంలో వేగంగా ఎదిగారు. 2014లో నారాయణ్‌గఢ్ నుంచి ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2016లో రాష్ట్ర మంత్రి బాధ్యతలు చేపట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిపై ఏకంగా 3.83లక్షల మెజార్టీతో విజయం సాధించారు. గతేడాది అక్టోబరులో భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హరియాణా ఓబీసీల్లో సైనీల జనాభా దాదాపు 8 శాతం. కురుక్షేత్ర, హిస్సార్, అంబాలా, రేవాడీ జిల్లాల్లో వీరి ప్రాబల్యం ఎక్కువ. భాజపా సోషల్ ఇంజినీరింగ్‌కు ఈ అంశం తిరుగులేని ఆయుధం వలే ఉపయోగపడింది.

# 10న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

**(మొదటి పేజీ తరువాయి)**
మాట్లాడుతూ, 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా, బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ లనుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని 150 ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించినట్టు తెలిపారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లోఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెలకెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను కోరారు. సాయంత్రం 5 .30 నుండి 7 .30 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ప్రతీ శాఖ ఒక సీనియర్ అధికారిని ప్రత్యేకంగా నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సి.ఎస్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు వాణి ప్రసాద్, దాన కిషోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు,హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వీ ఆనంద్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హరియాణాలో హ్యాట్రిక్ విజయం..

**(మొదటి పేజీ తరువాయి)**
అభ్యర్థులు దెబ్బ తీశారు. జాట్లు వర్సెస్ జాటేతర వర్గాలుగా చీలిపోయిన హరియాణా ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు ద్వారా విస్పష్టమైన తీర్పుచెప్పారు. జాట్లలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపగా.. జాటేతరుల్లో అత్యధికులు బీజేపీకి ఓటేయడంతో.. కమలనాథులు అనూహ్య విజయం సాధించారు. రెండు పార్టీల మధ్య ఓటు శాతం అత్యంత తక్కువగా ఉండడానికి కారణం ఇదే. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో సతమతమవు తుంటే.. మరోవైపు బీజేపీ తనదైన శైలిలో ఎన్నికల వ్యూహాలను అమలు చేసింది. మరోవైపు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లకు ఆమ్ ఆద్మీ, బీఎస్పీ రూపంలో గండి పడింది. ఇది బీజేపీకి ఎంతగానో అనుకూలించగా, కాంగ్రెసకు తీవ్రంగా నష్టం చేసింది. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆప్ హరియాణాలో మాత్రం ఒంటరిగా బరిలో దిగింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో వివక్ష

**(మొదటి పేజీ తరువాయి)**
విద్యా వ్యవస్థ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ఇంతకు మించిన ఉదాహరణ లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 19 వేల కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేయడం జరిగింది. ప్రతి ఏడాది సగటున క్రమం తప్పకుండా రెండు వేల కోట్లు విడుదల చేసిందని, కరోనా వంటి సంక్షోభ సమయంలోనూ ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికి కేవలం విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్య పట్ల తమకున్న ప్రాధాన్యాన్ని చాటి చెబుతుందని హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. దసరా, దీపావళి వేళ సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేక పోతున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. సిబ్బంది నుండి తమపై విపరీతమైన ఒత్తిడి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భవనాల అదెలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు వడ్డీలు కట్టలేక, కొత్త అప్పులు దొరక్క కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు చెల్లించేలా ప్రభుత్వాన్ని నిలదీస్తాం..ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. 13 లక్షల విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## యూ ట్యూబర్‌పై కేసు..కెటిఆర్ ఆగ్రహం

**(మొదటి పేజీ తరువాయి)**
రైతుబంధు జమ చేశారు. కానీ రేవంత్ పాలనలో రైతుబంధు రాక అప్పులపాలవుతున్నామని, మళ్లీ కేసీఆరే రావాలి.. నాతో పాటు మరో పది మందితో కేసీఆర్‌కు ఓట్లు వేయిస్తామని రైతు మల్లయ్య ఆవేదనతో మాట్లాడారు. రైతు మల్లయ్య మాట్లాడిన వీడియోను జర్నలిస్టు గౌతమ్ గౌడ్ యూట్యూబ్‌లో పోస్టు చేశారు.

## రోడ్డు భద్రతపై యునిసెఫ్ సహకారం

**(మొదటి పేజీ తరువాయి)**
పాలసీలు అధ్యయనం చేసి ఇక్కడ అమలు చేసే దానిపై జీవో తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. వాహనాల చెకింగ్‌కు సరైన విధానం అమలు జరగడం లేదని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ తీసుకొస్తున్నామన్నారు. ఒక్కో సెంటర్‌కు రూ.8 కోట్లు ఖర్చు అవుతుందని... రాష్ట్రంలో 32 సెంటర్లు తీసుకొస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా సంవత్సరానికి లక్షా 60 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కూడా రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక నిబంధనలు తీసుకొస్తున్నామన్నారు. రోడ్డు భద్రతపై యునిసెఫ్ సహకారం తీసుకుంటున్నామని
తెలిపారు. ప్రతి పాఠశాలలో రోడ్డు సేఫ్టీపై అవగాహన కలిస్తున్నామని చెప్పారు. వచ్చే నెలలో రోడ్డు సేఫ్టీ మంత్ ఉందని.. సిగ్నల్, జీబ్రా క్రాసింగ్ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 8 వేల లైసెన్స్2లు రద్దు చేయబడ్డాయన్నారు. 'ప్రాణంపోతుంది.. ప్రాణం నుంచి రక్షించుకోవడానికి సుప్రీం కోర్టు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం.. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశం ఉండదు. వాహనాలు కొనుక్కున్నా... వారి పేరు మీద నమోదు చేసుకునే అవకాశం ఉండదు. ప్రాణ నష్టాన్ని అవేర్నెస్ క్రియేట్ చేయడం చిన్న పిల్లల స్థాయి నుంచి ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలి. ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వాహనాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. కొత్తగా 113 మంది వెహికిల్ ఇన్స్పెక్టర్లు నియామకాలు పూర్తి చేసుకొని విధుల్లోకి రాబోతున్నారు.. వారిని మరింతగా ఉపయోగించుకుంటాం. ఆర్టీసీలో ఎంవీఐ రూల్స్ అమలు అవుతున్నాయి. ఎక్కడ ఇబ్బంది లేదు. జీహెచ్ఎంసీలో ఉన్న వాహనాలు అయినా ఏదైనా రూల్స్ పాటించాల్సిందే. ప్రభుత్వ వాహనాలకు కూడా నిబంధనలు వర్తిస్తాయి.. ఇరు రాష్ట్రాలకు సంబంధించిన రవాణా శాఖ అంశాలు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చిస్తారు. టీఎస్ నుంచి టీజీకి మారినప్పుడు.. టీఎస్ వాహనాలు మళ్లీ టీజీగా మారుతాయని చెప్పలేదు. కొత్త వాహనాలు టీజీగా వస్తున్నాయి. నిబంధనలు ఉల్లఘించి వాహనాలు లైసెన్స్ రద్దు అయితే వాళ్ళు వాహనాలు కొనడానికి ఉండదు.. వాహనాలు నడపడానికి ఉండదు. మా డిపార్ట్‌మెంట్ నుంచే కాకుండా యూనిసెఫ్ వారితో కూడా అవగాహన కల్పిస్తున్నాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఈ ఫలితాలు బిజెపికి ప్రత్యేకం

**(మొదటి పేజీ తరువాయి)**
శ్రేణుల్లో సంబరాలు వెల్లవెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో హర్యానా ప్రజలకు సామాజిక మాధ్యమంలో వరుస పోస్టుల్లో మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వడం ద్వారా హర్యానా ప్రజలు మరోసారి తమ సత్తాను చాటుకున్నందుకు కృతజ్ఞతలు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకంజ వేసే ప్రసక్తి లేదని భరోసా ఇస్తున్నాను అని మోదీ ట్వీట్ చేశారు. మరో ట్వీట్‌లో ఇంతటి ఘన విజయానికి అంకితభావంతో అవిశ్రాంతంగా కృషి చేసిన పార్టీ కార్యకర్తలందరికి ఆయన అభినందలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధి ఎజెండాను కార్యకర్తలు ఇంటింటికి తీసుకువెళ్లడం కూడా పార్టీ విజయానికి ఒక కారణమని ప్రశంసించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాల సరళిని హరియాణా ఎన్నికలు తారుమారు చేశాయి. ఈ ఫలితాలు భాజపాను మరోసారి అధికార పీఠమెక్కించాయి. వరసగా మూడోసారి కాషాయ పార్టీ సాధించిన విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సుపరిపాలన రాజకీయాలు గెలిచాయని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భాజపా ఎలాంటి అవకాశాన్ని వదిలేయదన్నారు. హరియాణాలో సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి, సుపరిపాలన రాజకీయాలు గెలిచాయి. మూడోసారి కూడా భాజపాను గెలిపించిన హరియాణా ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ఎంతో శ్రమించారు. దీని ఫలితంగానే కాషాయ పార్టీ మరోసారి నెగ్గింది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు భాజపా ఎలాంటి అవకాశాన్ని వదిలి పెట్టదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఫలితాలపై స్పందించిన ప్రధాని.. ఎన్సీకి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సభలో మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ తీరును ఏకి పారేశారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఈ ఎన్నికలు ఎంతో ప్రత్యేకమైనవి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. ప్రజాస్వామ్యంపై ప్రజలకున్న నమ్మకాన్ని తెలియజేస్తున్నాయి. ఇక్కడి ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్సీకి నా అభినందనలు. కేంద్రపాలిత ప్రాంతంలో భాజపా పని తీరు పట్ల గర్వపడుతున్నా. జమ్మూకశ్మీర్ సంక్షేమం కోసం కృషి చేస్తాం' అని ప్రధాని హామీ ఇచ్చారు.కాగా.. జమ్మూకశ్మీర్‌లో అధికార పీఠం నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికి సొంతమైంది. ఎన్సీ ఇప్పటివరకు 42 స్థానాలను గెలుచుకోగా.. కాంగ్రెస్ 6 సీట్లను సొంతం చేసుకొంది. 29 చోట్ల భాజపా గెలుపొందింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో భాజపా పని తీరుపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తల కృషిని కొనియాడారు.

## త్వరలో విద్యుత్ శాఖలో ఖాళీల భర్తీ

**(మొదటి పేజీ తరువాయి)**
విద్యుత్ శాఖలో ప్రమోషన్లు లేక అధికారులు ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చామని వివరించారు. ఎక్కడ కూడా విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు వేలాడి ఉండకూదన్నారు. అధికారులు సీరియస్‌గా తీసుకుని మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వం ఎంత చర్యలు తీసుకున్నా క్షేత్రస్థాయిలో లైన్ మెన్ల ప్రవర్తన సరిగా లేకపోతే చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంధన శాఖలో పనిచేసే ఉద్యోగుల పిల్లల చదువుల విషయంలో కొత్త స్కీమ్ తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. కరెంట్ ట్రిప్ కాకుండా అవసరం మేరకు ట్రాన్స్ ఫార్మర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యుత్ సమస్యలు, ఫిర్యాదుల కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉన్నదని, దానిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి దసరా రోజున భూమిపూజ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలకు ప్రత్యేక డిజైన్లు తయారు చేయించినట్లు ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి విద్యాబోధన, క్రీడలు, సినిమా థియేటర్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం సహా పలు వసతులతో భవనాల నిర్మాణం జరగబోతోందని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇకపై ఇంటర్నేషనల్ స్థాయిలో విద్యాప్రమాణాలు ఉంటాయని ఉపముఖ్యమంత్రి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యున్నత ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో విద్యా బోధన ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఈ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీల పిల్లలందరూ చదువుకుంటారని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్ బిల్లులు రూ.114కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇకపై పిల్లల కాస్మోటిక్ ఛార్జీలను ఏ నెలకు ఆనెలే అందజేస్తామని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పూర్తిస్థాయిలో విడుదల చేశామని, ఇకపై అందరికీ ప్రతి నెలా జీతాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లు అన్నీ త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. దసరా కంటే ముందే అన్ని రకాల పెండింగ్ బిల్లులు విడుదల చేయబోతున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. మరోవైపు దసరా సందర్భంగా రైతులకు ఆయన శుభవార్త చెప్పారు. రాష్ట్రంలో అడిగిన రైతుకల్లా ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ పోల్స్ ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు భట్టి వెల్లడించారు. కావాల్సిన రైతులు 1912కు ఫోన్ చేసి సమస్యపై ఫిర్యాదు చేయాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ది కోసం మూసీ ప్రక్షాళనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి లాంటి వాళ్లు పదేళ్లపాటు అబద్దాలు చెప్పిచెప్పి తమ లాగే అందరూ ఉంటారని అనుకుంటున్నారు. మూసీపై క్యాబినెట్‌లో చర్చించే నిర్ణయం తీసుకున్నారా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నిస్తున్నారని, చర్చ లేకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకుంటామని భట్టి మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కరే నిర్ణయాలు తీసుకున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అలాగే ఉంటుందని జగదీశ్ రెడ్డి అపోహపడుతున్నారని భట్టి విమర్శించారు. తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజాస్వామ్య ప్రభుత్వమని డిప్యూటీ సీఎం చెప్పారు. మూసీని శుద్ధి చేసి హైదరాబాద్ నడిబొడ్డున స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా సుందరీకరణ చేయబోతున్నట్లు ఆయన చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పి చేయలేదని, ఆ పార్టీ నేతలకు కమిట్మెంట్ లేదని భట్టి ఆరోపించారు. మూసీని సుందరీకరించి కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మూసీ నిర్వాసితులకు ఎట్టిపరిస్థితుల్లో అన్యాయం జరగనీయబోమని ఉప ముఖ్యమంత్రి భట్టి స్పష్టం చేశారు. వారికి నివాసాలు ప్రభుత్వం నిర్దేశిరచిన చోట ఏర్పాటు చేస్తే జగదీశ్ రెడ్డికి వచ్చిన నష్టం ఏంటని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పెద్దల్లా తాము ఎవరినీ కలవనీయకుండా గడీలలో లేమని ఎద్దేవా చేశారు. సలహాలు ఇవ్వాలంటే తమ ఎదుటకు వచ్చి ఇవ్వొచ్చని చెప్పారు.



## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**అలంపూర్, అక్టోబర్ 8(నమస్తే ఉదయం):**
అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి సురేఖకు పాలక మండలి చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ పురేందర్, అర్చకులు పూర్ణకుంభంలో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున తెచ్చిన పట్టు వస్త్రాలను అందజేశారు. కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామివారి ఆలయంలో నిర్వహించిన యాగంలో పాల్గొన్నారు.

## సైబరాబాద్ సీపీ మహంతిని సన్మానించిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి

**రాజేంద్ర నగర్, అక్టోబర్ 8(నమస్తే ఉదయం)?:**
భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సైబరాబాద్ సీపీ మహంతి , జాయింట్ సీపీ డి జోయెల్ డెవిస్ లను సన్మానించారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేష్ నిమజ్జనం విజయవంతం చేసిన సందర్భంగా సిపి మహంతి కి శాలువా



తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషిధర్, సైబరాబాద్ ఏరియా కన్వీనర్ బద్దం మహిపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ వై శ్రీధర్. జాయింట్ కన్వీనర్ బొక్కా బాల్ రెడ్డి, డి యాదగిరి,శివ తదితరులు పాల్గొన్నారు .

## డాక్టర్ రామరాజును సన్మానించిన చంద్రశేఖర్ ముదిరాజ్

**శంషాబాద్, అక్టోబర్ 8 (నమస్తే ఉదయం):**
పెద్ద షాపూర్ గ్రామంలో ఇటీవల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా పెరిగిపోవడంతోభారీ వాహనాల సంచారంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాలు విపరీతమైన స్పీడ్ తో వెళ్లడం వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ చేక్కల చంద్రశేఖర్ ముదిరాజ్ లీమ్స్ ఆస్పత్రి యజమాన్యాన్ని కలిసి బారికేడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఆయన అభ్యర్థన మేరకు లిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ రామరాజు వెహికల్ స్పీడ్ నియంత్రణకై నాలుగు బార్కెడ్లు పెద్దషాపూర్ గ్రామానికి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ ముదిరాజ్ లిమ్స్ ఆసుపత్రి ఎండి డాక్టర్ రామరాజు



ట్రాఫిక్ నియంత్రణ కోసం పెద్ద షాపూర్‌లో భారీ కేడ్లు ఏర్పాటు చేసిన లిమ్స్ ఆసుపత్రి

ని ఘనంగ శాలువా పూలమాలలతో సన్మానించి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ జితేందర్ రెడ్డి. కారోబార్ రాజిరెడ్డి స్థానికులు సురేష్ నాయక్. శివ. పవన్. శ్రీకాంత్. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**(మొదటి పేజీ తరువాయి)**



ఈ బతుకమ్మ ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుండి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబరాలు చేశారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్సవాలలో సచివాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అనితలకు వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

# శివాలయంకు దారి వదలాలి : బీజేపీ

**రాజేంద్రనగర్, అక్టోబరు8(నమస్తే ఉదయం):** రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని శివరాం పల్లి వీకర్ సెక్షన్ కాలనీ లోని పురాతన శివాలయాన్ని దర్శించుకోవడానికి దారి ని వదలాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమే మంగళవారం రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, వెజిటేబుల్ రీసెర్చ్ సెక్షన్ హెడ్ డాక్టర్ అనితలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. 50 సంవత్సరాలుగా పూజలు చేసుకోవడానికి వీలున్న శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని శివాలయం కు వెళ్లకుండా శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు రహదారికి అడ్డుగా గోడను నిర్మించారని వాపోయారు. ఈ విషయంపై కాలనీ వాసులు, ప్రజలు రాజేంద్ర నగర్ నియోజక వర్గ బీజేపీ నాయకుల దృష్టికి తీసుకు వెళ్లడం తో మంగళవారం వారు శివరాంపల్లి కి చేరుకుని అధికారులతో మాట్లాడారు. పూజలు చేసుకోవడానికి కనీసం గేటు అయినా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తల తో కలిసి శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంకి చేరుకొని అధికారులతో మాట్లాడారు. పురాతన శివాలయాన్ని దర్శించుకోవడానికి వీలు లేకుండా అడ్డుగా గోడను నిర్మించి భక్తులకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే అడ్డుగా నిర్మించిన గోడ ను తొలగించి భక్తులు శివాలయానికి వెళ్లి విధంగా



గేట్‌ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. పార్టీ సీనియర్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.

సానుకూలంగా స్పందించిన కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు ప్రజలకు ఇబ్బందులూ తలెత్తకుండా గేట్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బొక్క బల్ రెడ్డి, రాజేంద్ర అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ,జోగి రవి, విజయ్, బాబు రావు, సత్యనారాయణ, పాండు యాదవ్, ఎన్ను శంకర్, శివ, రాజు, స్థానిక యువకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





తన కూతురు వివాహానికి తెలంగాణ రాష్ట్ర స్పీకర్ ప్రసాద్ కుమార్, ఐటీ మంత్రి శ్రీధర్ బాబులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును ఆహ్వానించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, అక్టోబర్ 8(నమస్తే ఉదయం):** భారత దేశ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడుని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ని కలిసి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డితో కలసి తన కూతురు వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కోరి ఆహ్వాన పత్రిక అందజేసిన మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



# అమ్మపల్లి దేవాలయం వద్ద అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు...

## తన్వి రాజు ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

## తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్న బతుకమ్మ.

**శంషాబాద్, అక్టోబర్ 8(నమస్తే ఉదయం):** బతుకమ్మ పండుగ కేవలం ఆటపాట కాదని ఇది తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుందని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శంషాబాద్ మండలంలోని నర్కుడ



గ్రామంలోని అమ్మపల్లి దేవాలయం వద్ద బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నీరటి తన్వి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీతారామచంద్రస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పటే బతుకమ్మ



వేడుకలను ప్రతి ఒక్కరు ఆచరించాలని సూచించారు. నీరటి తన్వి రాజు ముదిరాజ్ గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని ఆయన అభినందించారు. ఖర్చుకు వెనకాడకుండా స్వంత డబ్బులతో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బతుకమ్మ వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను ప్రదర్శించి ఆడుతూ పాడుతూ సరదాగా గడిపారు. మండల సీనియర్ నాయకులు కొడిగంటి చంద్ర రెడ్డి. దూడల వెంకటేష్ గౌడ్. నీరటి రాజు ముదిరాజ్. నీలా మోహన్ నాయక్ . దండు ఇస్తారి . సంజయ్ యాదవ్. చందన వెల్లి శ్రీనివాస్. నీరటి శేఖర్ ముదిరాజ్. నీరటి మహేష్. దేవరకొండ రమేష్ యాదవ్. పో రెడ్డి శ్రీనివాస్ రెడ్డి. పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. సత్యానందం. శ్రీకాంత్ గౌడ్. పారేపల్లి శ్రీనివాస్ గౌడ్ సంగీత సిద్దేశ్వర ముదిరాజ్.గుండాల విశ్వనాథ్. నీరటి అశోక్. దేవిక జగన్ గౌడ్. సరితా రవీందర్ నాయక్. తదితరులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.



# మృత్తికాశాస్త్ర విభాగంలో పరిశోధనలకు అవార్డుల ఎంపిక ప్రక్రియ

**రాజేంద్రనగర్, అక్టోబర్ 8(నమస్తే ఉదయం):** భారత మృత్తికాశాస్త్ర సంఘం( న్యూఢిల్లీ ప్రతిఏటా )వార్షిక సదస్సులో మృత్తికాశాస్త్ర విభాగంలో పీజీ, పీహెచ్డీ విద్యార్థుల ఉత్తమ పరిశోధనలకు జోనల్ స్III జాతీయస్థాయిలో ప్రకటించే అవార్డుల ఎంపిక ప్రక్రియను నిర్వహించడానికి ఈ సంవత్సరానికి గాను భారత మృతిక శాస్త్ర సంఘం- హైదరాబాద్ చాప్టర్‌ను ఎంపిక చేసింది.పిజీలో అత్యుత్తమ పరిశోధనలను చేసిన విద్యార్థులకు జోనల్ స్థాయిలో, పీహెచ్ డీ లో అత్యుత్తమ పరిశోధనలను చేసిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో ప్రకటించే అవార్డుల ఎంపిక ప్రక్రియను నిర్వహించడానికి కౌన్సిల్ ఐదుగురు సభ్యుల జడ్జి కమిటీని నియమించింది. సీనియర్ ప్రొఫెసర్ ,మృత్తికా శాస్త్ర విభాగం యూనివర్సిటీ హెడ్, భారత మృతిక శాస్త్ర సంఘం అధ్యక్షురాల వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి. జయశ్రీ చైర్మన్ గా, డాక్టర్ కె. పవన్ చంద్రా రెడ్డి (ప్రధాన శాస్త్రవేత్త) మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న కమిటీలో డాక్టర్ విబి కులిగోడ్( ధార్వాడ్), డాక్టర్ ఆర్. శ్రీనివాసన్ (బెంగళూరు) , డాక్టర్ పి. బాలసుబ్రమణ్యం (కోయంబత్తూర్) సభ్యులుగా ఉన్నారు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియను మంగళవారం నాడు వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ నుండి వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. దీంట్లో ఎంపికైన విద్యార్థులకు జాతీయస్థాయిలో జరిగే వార్షిక సదస్సులో అవార్డులను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థిని, విద్యార్థులు, ఐసిఏఆర్ సంస్థల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.





బాబుల్ రెడ్డి నగర్‌లో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా రెడ్డి, శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరవుతున్న సబితా రెడ్డి

# దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: మాజీ మంత్రి సబితా రెడ్డి

## 5 వ రోజు మహాచండీ అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు.

## పూజలో పాల్గొన్న సబితాఇంద్రారెడ్డి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 8(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి, బాబుల్ రెడ్డి నగర్‌లో నవదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత ప్రతిమ మాజీ కౌన్సిలర్ వెంకటేష్, సీనియర్ నాయకులు సోమ శ్రీనివాస్ ఆహ్వానం మేరకు దుర్గామాత అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గము శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సబితా ఇంద్రారెడ్డికి నవదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మేళ వాయిద్యాలతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలతో వేద ఆశీర్వదాలు అందచేశారు. పి.సబితా ఇంద్రారెడ్డి వస్తున్నారని తెలిసి పెద్ద సంఖ్యలో మైలాలు తండోపతండాలుగా వచ్చి మా ఊరి ఆడపడుచు వచ్చింది అని తెలుపగా దానికి సమా ధానంగా సబిత ఇంద్రారెడ్డి నా పుట్టింటికి వచ్చినట్లుగ ఆనందంగా ఉందని అభివర్ణించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణకు నిత్య విజయాలు కలిగేలా దుర్గామాత కృపాకటాక్షాలు ప్రజలందరిపై వుండాలనీ, ప్రజలందరికీ సుఖ సంతోషాలను ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారని తెలిపారు. గతంలో ఇంద్రారెడ్డిని ఆశీర్వదించారు. ఇప్పుడు నన్ను ఆదరించారు రాబోవు రోజుల్లో మా కుమారుడు పికార్తీక్ రెడ్డి లను అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. సబిత ఇంద్ర రెడ్డి మాట్లాడు తున్నంతసేపు పెద్ద ఎత్తున మహిళలు సబితమ్మ కి జై కార్తీక్ రెడ్డి జిందాబాద్ నినాదాలతో నవదుర్గ మాత మండపం దగ్గర హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు డి రమేష్ ముదిరాజ్ , నోముల రాము యాదవ్ , అక్కెం రఘు యాదవ్ , బి.రాజేష్ యాదవ్ , లయన్ కార్తీక్ ముదిరాజ్ , అరుణ్ ముదిరాజ్, సురేష్ ముదిరాజ్ , మైసిరెడ్డి , గంజి రాజు, కొంపల్లి జగదీష్, ఈశ్వరయ్య , సంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి నవదుర్గ మండప నిర్వాహకులు శ్రీనివాస్ బెల్లంపల్లి, మల్లేష్, శివ రామకృష్ణ, పండ్ల సాయి రాజ్ కుమార్ ,బొంబాయి రవి, తిమ్మప్ప ,ప్రవీణ్, సన్నీ, భాస్కర్, అంజిరెడ్డి, కిషోర్, సోమ సందీప్ , అశోక్ , మహిళా నాయకురాలు లక్ష్మి ప్రసన్న, విజయలక్ష్మి , మహిళలు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాబుల్ రెడ్డి నగర్‌లో నెలకొల్పిన దుర్గామాతకు పూజలు చేస్తున్న మాజీమంత్రి సబితా రెడ్డి

# జనరల్ న్యూస్ GENERAL NEWS

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

బుధవారం 09, అక్టోబర్ 2024



## "ఆదిపర్వం" ఫస్ట్‌లుక్ రిలీజ్.. 31న థియేట్రికల్ రిలీజ్

రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్ టైన్ మెంట్స్ కలయికలో నిర్మించిన చిత్రం "ఆదిపర్వం". ఈ సినిమాలో మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మరో కీలక పాత్రను ఆదిత్యం ఓం పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా "ఆదిపర్వం" చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. "ఆదిపర్వం" సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 31న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. టాలెంటెడ్ యాక్ట్రెస్ మంచు లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా "ఆదిపర్వం" చిత్రంలో ఆమె క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.

క్యారెక్టర్ ఫస్ట్ లుక్ ఆసక్తికరంగా ఉండి ఆకట్టుకుంటోంది. ఇప్పటిదాకా మంచు లక్ష్మి చేయని, ఓ సరికొత్త పాత్రలో ఆమె ప్రేక్షకులను అలరించబోతున్నారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ - ముందుగా మంచు లక్ష్మికి పుట్టినరోజు శుభాకాంక్షలు. అన్వికా ఆర్ట్స్, ఏఐ ఎంటర్ టైన్ మెంట్స్ సహకారంతో నేను అనుకున్న స్థాయిలో ఒక గొప్ప చిత్రంగా "ఆదిపర్వం" ను మలిచానన్న సంతృప్తి మిగులుతోంది. మంచు లక్ష్మి, ఆదిత్యం ఓం, శివ కంఠమనినేని, ఎస్తేర్ పాత్రలకు జనం నీరాజనం పలుకుతారు. వాళ్ల పర్ ఫార్మెన్స్ మెమొరబుల్ గా ఉంటాయి. 1974-90 మధ్య కాలంలో జరిగిన యదార్థ ఘటనల సమాహారంగా ఈ సినిమాను రూపొందించాను. అమ్మోరు, అరుంధతి చిత్రాల తరహాలో దుష్టశక్తికి, దైవశక్తికి మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా.






## పుష్ప- 2 ది రూల్ ఫస్టాఫ్ లాక్..

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎదురుచూస్తున్ చిత్రం పుష్ప-2 దిరూల్. పుష్ప దిరైజ్ సాధించిన బ్లాకబస్టర్ విజయమే అందుకు కారణం. ఆ చిత్రంలోని ప్రతి అంశం సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పుష్ప-2 గురించి ప్రతి అంశం సన్సేషనే.. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్మాత్మకమైన పాన్ ఇండియా చిత్రంగా ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. డిసెంబరు 6న చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ చిత్రానికి సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రం ఫస్ట్‌హాఫ్ లాక్ చేశారు.. ఈ ఫస్ట్‌హాఫ్ అద్భుతంగా వుందని, ప్రేక్షకులు ఎంత ఊహించుకున్నా అంతకు తగ్గేదేలే లా వుందని అంటున్నారు చిత్ర యూనిట్ సభ్యులు. ప్రస్తుతం ఈ చిత్రం బ్యాలెన్స్ షూటింగ్‌ను జరుపుకుంటునే మరోవైపు నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఇటీవల ఈ చిత్రం నుంచి వచ్చిన టీజర్, రెండు పాటలు ఎంతటి సంచలనం సృష్టించాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాన్ ఇండియా స్థాయిలో డిసెంబరు 6న పుష్ప-2 క్రియేట్ చేయబోయే రిక్కార్డుల గురించి అందరి రెడీ కావాల్సిందే. అంతేకాదు ఈ చిత్రం రిలీజ్ కు ముందే 1000 కోట్ల ప్రీరిలీజ్ బిజినెస్ పూర్తిచేసిందని అంటున్నాయి ట్రేడ్ వర్గాలు.

## "క" 'మాస్ జాతర' లిరికల్ సాంగ్

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా "క". ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో "క" సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకు రాబోతున్నారు. "క" సినిమా నుంచి 'మాస్ జాతర' సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటను సామ్ సీఎస్ మంచి బీట్ తో కంపోజ్ చేశారు. సనాపాటి భరద్వాజ పాత్రుడు లిరిక్స్ అందించగా..దివాకర్, సామ్ సీఎస్, అభిషేక్ ఏఆర్ పాడారు. పొలాకి విజయ్ ది బెస్ట్ కొరియోగ్రఫీ చేశారు. హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు.



## ఓదెల 2- ఓదెల విలేజ్‌లో ఫైనల్ షెడ్యూల్ షూటింగ్

తమన్నా భాటియా, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్ కొలాబరేషన్ లో హైలీ యాంటిసిపేటెడ్ సీక్వెల్ 'ఓదెల 2' లో మునుపెన్నడూ చూడని పాత్రలో మెస్మరైజ్ చేయడానికి రెడీగా వున్నారు. 2021 బ్లాక్‌బస్టర్ హిట్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ గా వస్తున్న ఈ మూవీని అశోక్ తేజ డైరెక్టర్ చేస్తున్నారు. ఇప్పటికే ఫస్ట్‌లుక్, పోస్టర్, బీహైండ్ ది స్క్రీన్ కంటెంట్‌తో సంచలనం సృష్టించింది. తన కెరీర్‌లో తొలిసారిగా తమన్నా ఈ సినిమాలో శివశక్తి (నాగ సాధు) పాత్రలో నటిస్తోంది. ఓదెల2 చివరి షెడ్యూల్ ఓదెల విలేజ్ లో జరుగుతోంది. మహాదేవుని ఆశీస్సులతో కాశీలో ప్రారంభమైన ఈ థ్రిల్లింగ్ సీక్వెల్ ఇప్పుడు ఓదెల మల్లన్న క్షేత్రంలో చిత్రీకరణ జరుగుతోంది. టీం ఐకానిక్ ఓదెల మల్లన్న ఆలయం, గ్రామంలోని అందమైన ప్రదేశాలలో కీలక సన్నివేశాలను షూట్ చేస్తోంది. తమన్నా,





మురళీ శర్మ, హెబ్బా పటేల్, యువ, ఇతర నటీనటులు చిత్రీకరణలో పాల్గొంటున్నారు. తమన్నా మొదటి సారి ఓదెల విలేజ్‌లో షూటింగ్ చేస్తున్నారు. ఈ చివరి షెడ్యూల్‌ను రూపొందించడానికి సహకరించిన ఓదెల గ్రామస్తులకు మేకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.



## 'విశ్వం' యాక్షన్, కామెడీ, ఫన్.. ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది- హీరో గోపీచంద్

మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ 'విశ్వం'. కావ్యా థాపర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 11న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ ని నిర్వహించారు. హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ సినిమాకి టెక్నీషియన్స్ అందరూ చాలా కష్టపడ్డారు. చాలా రిస్కీ ప్లేసెస్‌లో ఈ సినిమాని షూట్ చేశాం. అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. సినిమా ఇంత అద్భుతంగా వచ్చిందంటే వాళ్ళ హార్డ్ వర్క్‌కే కారణం. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ సౌండింగ్ చాలా కొత్తగా ఉంది. ఎక్స్ ట్రార్డినరీ సాంగ్స్ ఇచ్చాడు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా ఇరగదీసాడు. తను చాలా పెద్ద మ్యూజిక్ డైరెక్టర్ అవుతాడు. గుహన్ గారితో ఎప్పటినుంచో వర్క్ చేయాలని అనుకున్నాం. ఈ సినిమాతో కుదిరింది. లొకేషన్స్, యాక్టర్స్ ని చాలా అందంగా చూపిస్తారు. ఎక్స్ ట్రార్డినరీ అవుట్ పుట్ ఇచ్చారు.

ప్రొడ్యూసర్స్ ఇద్దరికీ థాంక్స్ చెప్తున్నాను. డైరెక్టర్ శ్రీనుతో ఎప్పటినుంచో వర్క్ చేయాలని అనుకుంటున్నాను. టూ ఇయర్స్ బ్యాక్ ఒక ఫంక్షన్ లో కలిసాం. అప్పటినుంచి జర్నీ స్టార్ట్ అయింది. ఆయన స్క్రిప్ట్ చెప్తున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. తన సినిమాలో ఎంత ఎంటర్‌టైన్మెంట్ ఆశిస్తారో అంత ఎంటర్‌టైన్మెంట్ ఇవ్వడానికి ఆయన స్క్రిప్ట్ మీద దాదాపు 7 నెలలు పని చేశారు. ఆయన సీన్ చెప్పినప్పుడే చాలా అద్భుతంగా పెర్ఫాం చేస్తారు. అక్టోబర్ 11న దసరాకి సినిమా రిలీజ్ అవుతుంది. థియేటర్లో కూర్చున్న ప్రతి ఒక్కరూ నవ్వు ఆగదు. యాక్షన్, కామెడీ, ఫన్ ఎక్స్ ట్రార్డినరీగా వచ్చింది. ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. ఒక మాట చెప్పగలను. శ్రీనువైట్ల ఈజ్ బ్యాక్ విత్ బ్యాంగ్. థాంక్ యూ సో మచ్' అన్నారు.

## 'లగ్గం' చీరల పండుగ

లగ్గం చిత్ర యూనిట్ వినూత్నంగా ప్రమోషన్స్ లో దూసుకెళుతోంది... ఈ క్రమంలో లగ్గం చీరల పండుగ పేరుతో రీల్ పెట్టు - చీర పట్టు అనే కార్యక్రమంకు శ్రీకారం చుట్టారు. ఆసక్తి కలిగిన యువకులు ఇన్‌స్టాగ్రామ్ లో లగ్గం సినిమాకు సంభందించి పాటలకు గానీ లేదా టీజర్ లో డైలాగ్స్ కు గాని తమ స్టైల్ లో రీల్ లేదా యూట్యూబ్ షాట్ చేసి 8885050729 నెంబర్‌కు పంపితే చీరను గిఫ్ట్‌గా పొందవచ్చు... అలాగే రీల్ ను తప్పకుండా వారి అకౌంట్ లో పోస్ట్ చేసి లగ్గం పేజీకి టాక్ చెయ్యాలి, బహుమతులు అందచేయడానికి లగ్గం యూనిట్ సిద్ధంగా ఉంది. ఇది తెలంగాణ నేపథ్యంలో జరిగే తెలుగు సినిమా. చిత్రంలో నటీనటులు పూర్తి తెలంగాణ యాస మాట్లాడకుండా వాడుక భాషలో మాట్లాడుతారు. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుంది. ఇది లగ్గం నామ సంవత్సరం కాబోతుందని దర్శకుడు ధీమా వ్యక్తం చేశాడు. ఇటీవల విడుదలైన టీజర్ కు, పాటలకు ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. పోస్ట్ ప్రొడక్షన్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న లగ్గం సినిమా అక్టోబర్ 25న వరల్డ్ వైడ్ ఏషియన్ సురేష్ ద్వారా గ్రాండుగా విడుదల కాబోతోంది.



## 'యుఫోరియా' గ్లింప్స్ విడుదల

వైవిధ్యమైన సినిమాలు, భారీ చిత్రాలను తెరకెక్కించటంలో సెన్సేషనల్ డైరెక్టర్ గుణశేఖర్‌కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆయన డైరెక్షన్‌లో 'యుఫోరియా' అనే యూత్‌ఫుల్ సోషల్ డ్రామాని గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమాకి విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన తారాగణం కాగా.. భూమిక ముఖ్య పాత్రను పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను ప్రముఖ నిర్మాత దిల్ రాజు, కే ఎల్ దామోదర ప్రసాద్ రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమంలో దిల్ రాజు మాట్లాడుతూ.. 'గుణ శేఖర్ మొదటి చిత్రం లాఠీ. అది చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఆయన ఎన్నో సక్సెస్‌లు చూశారు. ఫెయిల్యూర్స్ కూడా చూశారు. ఫెయిల్యూర్స్ తరువాత వచ్చే సక్సెస్, ఆ సక్సెస్ ఇచ్చే కిక్కు వేరేలా ఉంటుంది. యుఫోరియా గ్లింప్స్ అదిరిపోయింది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉంది. నైట్ లైఫ్, డ్రగ్స్ ఇలా ఇప్పటి తరానికి తగ్గట్టుగా ఉంది. ఈ చిత్రంలో అందరూ కొత్త వాళ్లే నటిస్తున్నారు. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.




**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733